
సాక్షి
రంగారెడ్డి

బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

మైసిగండిలో కొలువుదీరిన కాశీవిశ్వనాథస్వామి ఆలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. 8లో▸



ఫార్మాసిటీ పెద్ద కుంభకోణం

ఫార్మాసిటీ ఏర్పాటు ఓ పెద్ద కుంభకోణం అని, దీనికి కేంద్రం నుంచి ఎలాంటి అనుమతులు లేవని బీజేపీ నేతలు అన్నారు. 8లో▸




ప్రభుత్వాలు విఫలం

సెంటిమెంట్ రాజకీయాలతో బీజేపీ, బీఆర్ఎస్ దేశాన్ని, రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టాయని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. 8లో▸

న్యూస్‌రీల్

‘ఆత్మ సాక్షాత్కారం’ ఆవిష్కరణ



కన్హా శాంతివనంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న స్వామి చిదానంద గిరి

నందిగామ: యోగదా సత్సంగ సొసైటీ సెల్ఫ్ రియలైజేషన్ (వైఎస్ఎస్) సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు స్వామి చిదానంద గిరి మంగళవారం కన్హాలో ‘ఆత్మ సాక్షాత్కారం వైపు ప్రయాణం’ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కన్హా శాంతివనంలో రెండో రోజు నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్ఎస్ వ్యవస్థాపకుడు పరమహంస యోగానంద రచించిన ఈ పుస్తకాన్ని ప్రతిఒక్కరూ చదవాలని సూచించారు. దైనందిన జీవితంలో భగవంతుడిని అనుభవంలోకి తెచ్చుకునేందుకు పరమహంస ఈ పుస్తకంలో పరిశీలనాత్మకంగా వ్యాసాలు రచించారని చెప్పారు. జ్ఞాన మార్గం ద్వారా కర్మను ఏ విధంగా జయించాలి, గురువుతో అనుసంధానంగా ఉండటం, కష్టాలను విజయాలుగా మార్చుకోవడం, నిస్వార్థంగా ఉండటంలో కలిగే ఆనందం, భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవడం వంటి విషయాలను పుస్తకంలో చక్కగా వివరించారని తెలిపారు. దీంతో పాటు ఒక యోగి ఆత్మకథ పుస్తకాన్ని సైతం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతి నిధులు, గురువులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల గడువు పొడిగింపు

మహేశ్వరం: పట్టణంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 2023 – 24 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల గడువును ఈ నెల 22వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ బీ ధనుంజయ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు హాల్ టికెట్లను ఏప్రిల్ 8వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. పరీక్ష ఫీజు జనరల్ విద్యార్థులకు రూ. 200, బీసీ, ఎస్సీ వికలాంగ విద్యార్థులకు రూ. 125 చెల్లించాలని తెలిపారు. ఏప్రిల్ 16న పరీక్ష ఉంటుందని తెలిపారు. 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9912617121, 9032196123లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తలకొండపల్లి: తలకొండపల్లి బస్టాండ్ ప్రాంతంలో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కోరారు. మంగళవారం బస్టాండ్ వద్ద రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇళ్లు కోల్పోతున్న బాధితులతో సమావేశమై వారి వినతులను స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తలకొండపల్లి నుంచి ఆమనగల్లు వరకు బీటీ రోడ్డు రెన్యూవల్ కోసం రూ.37 కోట్లు మంజూరయ్యాయన్నారు. రోడ్డు వెడల్పుతో ఇళ్లు కోల్పోతున్న వారికి మండల కేంద్రంలో ఇళ్ల స్థలాలిస్తామన్నారు.

వినిపించని ‘ప్రజావాణి’!

ఫిర్యాదుల స్వీకరణ, బదలాయింపునకే పరిమితం

- సమస్యల పరిష్కారంపై అధికారుల్లో చిత్తశుద్ధి కరువు
- ఏళ్ల తరబడి కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న బాధితులు



ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బడంగ్‌పేట్ భూ బాధితులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ‘ప్రజావాణి’ సమస్యల పరిష్కారంలో పెద్దగా చొరవ చూపడం లేదు. బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, క్షేత్రస్థాయి అధికారులకు బదలాయించడం మినహా.. పెద్దగా ఉపయోగం ఉండటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అర్జీలు పెట్టుకున్నా.. మళ్లీ ఆఫీసులు చుట్టూ తిరగాల్సి వస్తోందని బాధితులు ఆరోపిస్తున్నారు. కోవిడ్ కారణంగా 2020 మార్చిలో నిలిచిపోయిన ప్రజావాణి.. కరోనా ప్రభావం పూర్తిగా తగ్గిన తర్వాత 2022 సెప్టెంబర్‌లో పునఃప్రారంభమైంది. కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వందకు తగ్గకుండా అర్జీలు వస్తున్నాయి. ఇలా ఇప్పటి వరకు రెండు వేలకుపైగా వినతులు అందాయి. మెజార్టీ అభ్యర్థనలు ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో గతంలో వచ్చిన ఫిర్యాదుదారులే మళ్లీ ఇక్కడికి చేరుకుంటున్నారు. అదనపు కలెక్టర్ తిరుపతిరావు, డీఆర్‌ఓ హరిప్రియ సహా ధరణికి సంబంధించిన సాంకేతిక సిబ్బంది మాత్రమే ఈ ప్రజావాణిలో పాల్గొని అర్జీలు స్వీకరిస్తున్నారు. సలహాలు, సూచనలతో సరిపెడుతున్నారే కానీ.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా గత సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 70 అర్జీలు వచ్చాయి.

మా భూములు ఆక్రమించారు

‘దావుద్‌ఖాన్‌గూడ సర్వే నంబర్ 2లో 40 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 1955లో అప్పటి ప్రభుత్వం 40 మంది ఎస్సీలకు దీన్ని కేటాయించింది. నాటినుంచి ఈ భూమినే నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నాం. మాకు కనీసం నోటీసులు ఇవ్వకుండా, నష్ట పరిహారం చెల్లించకుండా ఎవరికి వారు ఇష్టానుసారం నిర్మాణాలు చేపడుతున్నారు. వీటిని తక్షణమే కూల్చివేయాలి. ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడాలి.. మాకు న్యాయం చేయాలని స్థానిక ఎమ్మెల్యే, తహసీల్దార్, ఆర్డీఓలకు విజ్ఞప్తి చేశాం. మా వినతులు పట్టించుకోకపోగా, మాపైనే కేసులు నమోదు చేయిస్తున్నారు. మీర్‌పేట్ పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకుని ఇబ్బంది పెడుతున్నారు’. ఇదీ.. బడంగ్‌పేట్ భూ బాధితుల ఆవేదన.

స్లాట్ బుక్ కావడం లేదు



నక్కర్తమేడిపల్లి సర్వే నంబర్ 90లో నాకు 1.25 ఎకరాల భూమి ఉంది. రెవెన్యూ కోర్టు కేసు ఉందని చెప్పి.. నిషేధిత జాబితాలో నమోదు చేశారు. నిజానికి ఆ భూమిపై ఎలాంటి కోర్టు కేసు లేదు. ఈ మేరకు తహసీల్దార్ రిపోర్ట్ కూడా రాసి పంపారు. ప్రొహిబిటెడ్‌ను తొలగించాలని రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నా. కానీ సమస్య తీరలేదు. వచ్చే నెలలో కుమార్తె పెళ్లి పెట్టుకున్నా. భూమి అమ్మగా వచ్చిన డబ్బుతో పెళ్లి చేయాల్సి ఉంది. రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ కావడం లేదు.

– పెండ్యాల నర్సింహ్మ, నక్కర్తమేడిపల్లి

రెండేళ్లుగా తిరుగుతున్నా



వికలాంగురాలిని.. ఇద్దరు పిల్లలైన తర్వాత భర్త వదిలేశాడు. ఒంటరిగా ఉంటున్నా. నిలువ నీడ లేదు. వికలాంగుల కోటా కింద వచ్చే పింఛన్ మినహా మరే ఆధారం లేదు. డబుల్ బెడ్రూం కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులతో పాటు తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ చుట్టూ తిరిగా. ఇల్లు మంజూరు కాలేదు. నడవలేని స్థితిలో ఉన్నా. డిగ్రీ పూర్తిచేసినా.. ఉపాధి దొరక లేదు. ఇంటితో పాటు ఉద్యోగ అవకాశం కల్పించాలి.

– చంద్రకళ, నందనవనం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

విధుల నిర్లక్ష్యాన్ని సహించం

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి
- జెడ్పీలో స్థాయీ సంఘాల సమావేశం
- పీసీబీ అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: విధులను నిర్లక్ష్యం చేసే అధికారుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి హెచ్చరించారు. ఖైరతాబాద్‌లోని జెడ్పీ ఆఫీసులో మంగళవారం స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించారు. విద్య, వైద్యంతో పాటు ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, గ్రామీణాభివృద్ధి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అడల్ట్ ఎడ్యుకేషన్, ఎక్సైజ్ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. కడ్తాల్ మండల పరిధిలోని ఫ్యాబ్ మెటల్ ప్రైవేట్ ఇండియా కంపెనీ కాలుష్యాన్ని వెదజల్లుతోందని, దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానిక జిల్లా ప్రాదేశిక సభ్యుడు ఆరోపించారు. ఈ సమయంలో సభ్యులకు సమాధానం చెప్పేందుకు పీసీబీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లేకపోవడాన్ని చైర్‌పర్సన్ తప్పుపట్టారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే.. చర్యలు తప్పవని ఫోన్ చేసి హెచ్చరించారు.

పట్నంలో మార్చురీ..

వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి సహా ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీలో ఓపీకి వస్తున్న రోగులు, ఇన్‌పేషెంట్లకు అందుతున్న చికిత్సలపై ఆరా తీశారు. కు.ని. ఆపరేషన్లు వికటించిన సమయంలో మూతపడిన ఓటీని ఇప్పటికీ పునరుద్ధరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వివిధ ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు అత్యవసర సమయంలో అవసరమైన రక్తాన్ని సరఫరా చేసేందుకు ఆస్పత్రిలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్డు, ఇతర ప్రమాదాల్లో చనిపోయిన వారి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించేందుకు ఆస్పత్రిలో కొత్తగా మార్చురీని అందుబాటులోకి తెచ్చామన్నారు.

‘కంటి వెలుగు’పై ఆరా

రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై స్థాయీ సంఘం ఆరా తీసింది. శిబిరాలకు నిత్యం ఎంత మంది వస్తున్నారు.? ఎందరికి రీడింగ్ గ్లాసులు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో స్క్రీనింగ్స్ ఎలా జరుగుతోంది..? అనే అంశాలను ఆరా తీశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్ల సంఖ్య తగ్గి.. సహజ ప్రసవాల సంఖ్య పెరగడం హర్షణీయమని తెలిపారు. ‘మన ఊరు మనబడి’ పథకం కింద 38 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని, ఇవి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీలు జంగమ్మ, శ్రీలత, కో ఆప్షన్ సభ్యులు అక్బర్‌ఖాన్ సహా జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్, అదనపు సీఈఓ రంగారావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, కొండాపూర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ వరదాచారి, గచ్చిబౌలి ఎస్‌ఈ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పెంజర్లలో భూ మాయ

- అసైన్డ్ భూమిని పట్టాగా మార్చే యత్నం
- తహసీల్దార్ కార్యాలయంలో అభ్యంతరాల స్వీకరణ నోటీసులు
- రెవెన్యూ అధికారుల వ్యవహారంపై విమర్శలు



రికార్డుల్లో అసైన్డ్‌గా నమోదైన సర్వే నంబర్ 255 వివరాలు

సాక్షి రంగారెడ్డి జిల్లా: కొంతమంది రాజకీయ నాయకులు, అధికారులు, రియల్టర్లు కుమ్మక్కై కొత్త దందాకు తెరతీశారు. అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చి కాజేసే కుట్ర పన్నుతున్నారు. సదరు భూములను పట్టా భూములుగా మార్చేందుకు అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచిస్తూ మంగళవారం పెంజర్ల గ్రామ పంచాయతీ, కొత్తూరు తహసీల్దార్ కార్యాలయాల్లో నోటీసులు అతికించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

52.16 ఎకరాల భూమి

కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామం, సర్వే నంబర్ 255లో సుమారు 52.16 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని 1989లో అప్పటి ప్రభుత్వం స్థానికంగా ఉన్న పలువురు పేదలకు అసైన్ చేసింది. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణిలోనూ అసైన్డ్ భూమిగా నమోదై ఉంది. నగరానికి సమీపంలో ఉండటం, ఎకరాకు రూ.1.50 కోట్లు పలుకుతుండటంతో వీటిపై రియల్టర్ల కన్ను పడింది. ఇప్పటికే ఈ భూములను అసైన్డ్‌దారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన రియల్టర్లు తాజాగా రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై పట్టాభూమిగా మార్చేందుకు తెరవెనక నుంచి పావులు కదుపుతున్నారు. ఇందుకోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అధికారులు ఆగమేఘాల మీద నోటీసులు జారీ చేయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. ప్రస్తుతం ఈ విషయంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాత రికార్డుల్లో పట్టాగానే ఉంది

పెంజర్లలోని సర్వే నంబర్ 255 పాత రికార్డులు 1954 నుంచి 2016 వరకు (పహణీ, కాస్ర, సేత్వార్) పట్టాగానే ఉంది. 2016 వరకు అన్ని రికార్డుల్లో పట్టాగానే నమోదవుతు వచ్చింది. 2017–18 ధరణి తర్వాత అసైన్డ్‌గా నమోదైనట్లు ప్రాథమికంగా గుర్తించాం. బాధిత రైతులు రికార్డు మార్పిడి కోసం దరఖాస్తు చేసుకోవడంతో అభ్యంతరాల స్వీకరణ కోసం నోటీసు పెట్టాం. సర్వే నంబర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు పరిశీలించిన తర్వాత పట్టానా..? అసైన్డ్ భూమినా..? అనే వివరాలు వెల్లడిస్తాం. ఇందులో ఎలాంటి అక్రమాలు, అవినీతి లేదు.

– రాములు, తహసీల్దార్, కొత్తూరు

గండిపేట సుందరీకరణ చేపట్టండి: సీఎస్



సాక్షి, సిటీబ్యూరో: గండిపేట చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం సమీక్ష నిర్వహించారు. బీఆర్‌కే భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్‌తో కలిసి గండిపేట చెరువు సుందరీకరణ పనులను సమీక్షించారు. మొదటి దశలో వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్ పనులను వెంటనే చేపట్టాలని ఆమె ఈ సందర్భంగా ఆదేశించారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. గండిపేట చెరువు చుట్టూ సుందరీకరణ పనులను చేపట్టేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. ఇందులో భాగంగా పార్కులను అభివృద్ధి చేయాలని చెప్పారు. కోర్టు కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఇక ఆపరేషన్ ముంబై



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ ఆనంద్

- ఆ నగరంలోని మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌పై దృష్టి
- ఇప్పటికే గోవాలో తుడిచిపెట్టేసిన హెచ్‌- న్యూ
- మహారాష్ట్ర పోలీసులతో పూర్తి సమన్వయం
- నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌ను డ్రగ్ ఫ్రీ సిటీగా మార్చడంపై దృష్టి పెట్టామని, ఈ దిశలో కీలక పురోగతి సాధిస్తున్నామని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. మూడు మాదక ద్రవ్యాల ముఠాలను అరెస్టు చేసిన నేపథ్యంలో మంగళవారం ఐసీసీసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌–న్యూ) అధికారులు ఏడాది కాలంలో అనేక ఫలితాలు సాధించారు. నగరానికి సరఫరా అవుతున్న డ్రగ్స్ మూలాలపై పోలీసులు దృష్టి పెట్టారు. ఇప్పటికే గోవా కేంద్రంగా దందా చేస్తున్న కీలక నిందితులను అరెస్టు చేసిన హెచ్‌–న్యూ జైలుకు పంపింది. దీంతో ఆ కేంద్రంగా సాగుతున్న మాదకద్రవ్యాల సరఫరాకు దాదాపు చెక్ చెప్పినట్లైంది. గోవా తర్వాత అదే స్థాయిలో డ్రగ్స్ దందా సాగుతున్న ముంబైలోని నెట్‌వర్క్‌పై ఇప్పుడు కన్నేసింది. అక్కడి పోలీసుల సహకారంతో మాదకద్రవ్యాల క్రయవిక్రయాలు, సరఫరాపై దృష్టి పెట్టింది.
- సింథటిక్ డ్రగ్ అయిన ఎండీఎంఏ నెట్‌వర్క్‌ను ఛేదించడానికి హెచ్‌–న్యూ అధికారులు వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లారు. దాదాపు రెండు నెలల పాటు అక్కడ నిఘా వేసి నిందితులను పట్టుకోవడానికి శ్రమించారు. నగరంలో ఐటీ కంపెనీలో పని చేస్తున్న సనా ఖాన్ డ్రగ్స్ వినియోగం నుంచి విక్రయం వరకు వెళ్లింది. ఆమెను అదుపులోకి తీసుకొని విచారించడంతోనే ముంబై డ్రగ్ నెట్‌వర్క్ వెలుగులోకి వచ్చింది. కేవలం ముంబై నుంచి సరఫరా అవుతున్న డ్రగ్స్‌తో పాటు మహారాష్ట్రకు సరఫరా అవుతున్న గంజాయి పైనా నగర పోలీసులు దృష్టి పెట్టారు. ముంబైలో డ్రగ్ విక్రయిస్తున్న వారిని అరెస్ట్ చేయడంతో పాటు పూర్తి వివరాలను ఆ నగర పోలీసు కమిషనర్‌కు అందించారు. ఆయన కూడా హైదరాబాద్ పోలీసులకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

కేజీ ఎండీఎంఏ రూ.20 లక్షలు..

- ఎండీఎంఏను ముంబైలోని ఫ్యాక్టరీలో తయారు చేస్తున్నారు. దాని ధర కేజీ రూ.2 లక్షల నుంచి మొదలై వినియోగదారుడి వద్దకు వచ్చేసరికి కనిష్టంగా రూ.20 లక్షలకు చేరుతోంది. ఈ డ్రగ్‌ను యువతులకు ఇచ్చి, వారిపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు ఉన్నాయని దర్యాప్తు, విచారణలో తెలుస్తోంది. హెచ్‌–న్యూ ఆపరేషన్ గోవాతో ‘నో సేల్ ఇన్ తెలంగాణ, హైదరాబాద్, నో సప్లై టు హైదరాబాద్’ అనే బోర్డుల్ని సోషల్‌మీడియా, డార్క్ నెట్‌ల్లో డ్రగ్ విక్రేతలు ఉంచుతున్నారు. ముంబై నెట్‌వర్క్‌నూ ఇలానే మార్చడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఉన్న డ్రగ్స్ వినియగదారుల పరిస్థితిని బట్టి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేయడం, పునరావాస కేంద్రాలకు పంపడంపై నిర్ణయం తీసుకుంటున్నారు.
- హెచ్‌–న్యూ డీసీపీ చక్రవర్తి గుమ్మి మాట్లాడుతూ.. ‘హెచ్‌న్యూ ఏర్పాటైన ఏడాది కాలంలో 104 కేసులు నమోదు చేసి, 12 రకాల డ్రగ్స్‌ను సీజ్ చేసింది. వాటి విలువ రూ.6.3 కోట్లు ఉంటుంది. మొత్తం 202 మందిని అరెస్టు చేయగా, 760 మంది వినియోగదారుల్లో 350 మందిని డీ అడిక్షన్ కేంద్రాల్లో కౌన్సెలింగ్ నిర్వహించాం. వీరిలో 80 మంది డ్రగ్స్‌కు పూర్తిగా దూరమై ప్రశాంతంగా ఉన్నారు. మిగిలిన వారికి చికిత్స కొనసాగుతోంది’ అని పేర్కొన్నారు.

అరెస్టులు అన్యాయం

- పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందే
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు



చేవెళ్లలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

చేవెళ్ల: కబ్జాదారులు, అక్రమార్కులు వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తున్నా పట్టించుకోని పోలీసులు.. పేదవాళ్లు గుడిసెలు వేసుకుంటే అరెస్టు చేయడం అన్యాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలో వందలాది మంది నిరుపేదలతో కలిసి భూ పోరాటానికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా చేవెళ్లలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసి, సీపీఐ జెండాలు పాతారు. అంతకు ముందు మార్కెట్ యార్డులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాల పంపిణీపై ప్రభుత్వాలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల తరఫున పోరాడుతున్న కమ్యూనిస్టులను అరెస్టు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రభుత్వమే స్థలాలిస్తే స్వాగతిస్తామని, లేదంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ.. జిల్లాలో అనేక ప్రభుత్వ భూములు ఉన్నాయని, వీటిని పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరుతూ గతంలోనే పలుమార్లు కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు పానుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రామస్వామి, ప్రభులింగం, మండల కార్యదర్శులు సత్తిరెడ్డి, సుధీర్, శ్రీనివాస్, జంగయ్య, వడ్ల సత్యనారాయణ, సుధాకర్‌గౌడ్, సుభాన్‌రెడ్డి, మక్బూల్, మాధవి, మంజుల, శివ, శివయ్య, నాగర్‌కుంట ఉప సర్పంచ్ రఘురాం, అనసూయ, తదితరులు ఉన్నారు.

డబుల్ డెక్కర్.. ట్రయల్ రన్



మొన్న ఫార్ములా ఇ– రేస్ సందర్భంగా ట్యాంక్‌బండ్ నెక్లెస్ రోడ్డుపై పరుగులు పెట్టిన డబుల్ డెక్కర్ బస్సు.. మంగళవారం ట్రయల్ రన్‌కు వచ్చింది. ట్యాంక్‌బండ్.. నిజాం కాలేజీ.. తెలుగుతల్లి ఫ్లై ఓవర్.. ఎల్బీ స్టేడియం మార్గాల మీదుగా మళ్లీ ట్యాంక్‌బండ్‌కు వచ్చింది. ఈ బస్సు ఆయా రోడ్లపై తిరగడంతో నగరవాసులు ఆసక్తిగా తిలకించారు.

అడవి జంతువుల దాడిలో గొర్రె పిల్లల మృతి



చనిపోయిన గొర్రె పిల్లలను పరిశీలిస్తున్న అధికారులు

కందుకూరు: అడవి జంతువుల దాడిలో 8 గొర్రె పిల్లలు మృతి చెందగా, మరో మూడు తీవ్రంగా గాయపడ్డాయి. మరో గొర్రె పిల్లను తినేశాయి. ఈ సంఘటన మండలంలోని దెబ్బడగూడ పరిధిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బండ మల్లయ్య వ్యవసాయ పొలంలో గొర్రెల మందను ఉంచాడు. సోమవారం ఎప్పటిలాగే గొర్రెలను మేతకు తీసుకుళ్లే క్రమంలో చిన్న పిల్లలను గంపల కింద ఉంచాడు. మధ్యాహ్నం అడవి జంతువులు దాడి చేసి 8 గొర్రె పిల్లలను చంపి, ఒకదాన్ని తినేశాయి, మరో మూడు పిల్లలు తీవ్రంగా గాయపర్చాయి. సాయంత్రం మందను తీసుకుని వచ్చి చూసిన పెంపకందారుడికి మృతి చెందిన గొర్రె పిల్లలు కనిపించాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం మండల వైద్యాధికారిణి డాక్టర్ రేవతి, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, అటవీ శాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనకు కారణం అడవి కుక్కలా లేక హైనా పనా అనేది పరిశీలిస్తున్నారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం నాయకులు శ్రీశైలం, పాలేష్, అంజయ్య, బాలకృష్ణ, సుభాన్, నాగేష్, రాజు తదితరులు కోరారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


కేశంపేట: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని సంతాపూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వెంకటయ్య(55) ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలాన్ని కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశాడు. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం మధ్యాహ్నం చేనుకు నీరుపెట్టడానికి వెళ్లి తిరిగి రాత్రికి ఇంటికి చేరుకోలేదు. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతకగా సోమవారం చేనులోపల మృతి చెంది కనిపించాడు. పంటచేను పైన ఉన్న విద్యుత్ తీగల కారణంగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

- ముస్తాబవుతున్న మైసిగండి కాశీవిశ్వనాథస్వామి ఆలయం
- మూడు రోజుల పాటు ఉత్సవాలు



మైసిగండి కాశీవిశ్వనాథస్వామి ఆలయం



మూలవిరాట్టు

కడ్తాల్: మండలంలోని మైసిగండిలో కొలువుదీరిన కాశీవిశ్వనాథస్వామి ఆలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నెల 17వ తేదీ ఉత్సవాలు ప్రారంభమై 19వ తేదీ ముగియనున్నాయి. ఉత్సవాలను తిలకించేందుకు జిల్లాతో పాటు, సమీప జిల్లాల నుంచి భక్తులు తరలిరానున్నారు.

ఆలయ చరిత్ర..

మైసిగండి శివాలయ, రామాలయాలు, ఋగ్వేద కాలంలో గంగా గుళ్లుగా పిలిచేవారని ఆలయ చరిత్ర చెబుతోంది. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన శివాలయ, రామాలయాలు గోల్కొండ నవాబుల కాలంలో అక్కన్న, మాదన్నలు మహా మంత్రులుగా ఉన్న సమయంలో నిత్యం విశేష పూజలు జరిగినట్లు ప్రచారంలో ఉంది. తర్వాతి కాలంలో జీర్ణించుకుపోయిన ఈ ఆలయాలను 22ఏళ్ల క్రితం పునర్నిర్మించేందుకు దివంగత ఎంపీపీ, అప్పటి ఆలయ ట్రస్టీ ఆర్ పంతునాయక్ ఎంతో కృషి చేశారు. ఋగ్వేద కాలం నాటి ఆలయాన్ని దాతలు, ప్రభుత్వ సహకారంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నిత్యం భక్తుల తాకిడితో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. ఆలయ పరిసరాల్లోని పవిత్ర కోనేరు గంగాజలంలో స్నానమాచరిస్తే రోగాలు, పాపభీతి తొలగిపోతాయాని భక్తుల విశ్వాసం.

బ్రహ్మోత్సవాల వివరాలు

17వ తేదీ శుక్రవారం విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణం, స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 18న మహా శివరాత్రిని పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణ మహోత్సవం, రాత్రి 12 గంటలకు ప్రత్యేక అభిషేకం, అనంతరం రథోత్సవం, 19న స్వామివారికి ఏకాదశ కలశాభిషేకం, వసంతోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈవో స్నేహలత, ఆలయ ట్రస్టీ శిరోలీ తెలిపారు.

ప్రత్యేక ఏర్పాట్లు



మహాశివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయడంతో పాటు, భక్తులకు తాగునీటి వసతి కల్పిస్తున్నాం. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతి రోజూ నవగ్రహ హోమం, గణపతి హోమం నిర్వహిస్తాం. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలి.

– స్నేహలత, ఈవో, మైసిగండి ఆలయం

నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలి

డీబీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్



మాట్లాడుతున్న ఆనంద్, నర్సింహ

కడ్తాల్: ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళిత, గిరిజనులకు కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేయాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీ ఆనంద్, ప్రధాన కార్యదర్శి జీ నర్సింహులు డిమాండ్ చేశారు. మంగళవారం కడ్తాల్ మండల కేంద్రంలో డీబీఎస్‌యూ నాయకులతో కలిసి వారు మాట్లాడారు. రాష్ట్రంలో సమగ్ర సర్వే 2014 ప్రకారం దళిత జనాభా 17శాతం ఉందని తెలిపారు. బడ్జెట్‌లో ఎస్సీ ప్రత్యేక నిధి కోసం రూ. 36,750 కోట్లు కేటాయించారని, కేటాయింపుల్లో పెరుగుదల ఉన్నా, గతంతో పోల్చితే పెరుగుదల శాతం మాత్రం తక్కువగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పథకాలకు సంబంధించి ఒక్క దళిత బంధు పథకానికి రూ. 17,700 కోట్లు కేటాయించగా, మిగతా కేటాయింపులు తక్కువగా ఉన్నాయని తెలిపారు. దళితుల సంక్షేమానికి కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జోగు రమేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కావలి రాములు, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు సిద్దిగారి దాస్, నాయకులు సాయిలు, చంద్రయ్య, వెంకటేశ్, రాంచంద్రయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలంటూ ధర్నా



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ప్రయాణికులు

- సీఐ లింగయ్య జోక్యంతో సద్దుమణిగిన సమస్య
- మార్చి 10లోపు పనులు పూర్తి చేస్తాం: నల్గొండ డీఈఈ

యాచారం: మాల్ – మర్రిగూడ రోడ్డు పనులు పూర్తి చేయాలంటూ రంగారెడ్డి జిల్లా యాచారం, నల్గొండ జిల్లా మర్రిగూడ మండలాల ప్రయాణికులు మంగళవారం ఆందోళనకు దిగారు. రోడ్డుపై టెంట్ వేసి, అడ్డంగా ఆటోలు పెట్టి రాస్తోరోకో, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మునుగోడు ఎన్నికల సమయంలో నల్గొండ జిల్లా రోడ్డు భవనాల శాఖ అధికారులు మాల్ కేంద్రం నుంచి మర్రిగూడ మండల కేంద్రం వెళ్లే రోడ్డును తవ్వి, కంకర పోశారని తెలిపారు. నేటికీ పనులు పూర్తి చేయలేదన్నారు. దీంతో దుమ్ము, ధూళి చెలరేగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. దుమ్ము, ధూళి కారణంగా ప్రజలు గాలి పీల్చుకునే పరిస్థితి లేదని తెలిపారు. ఈ సమస్యను పలుమార్లు రంగారెడ్డి, నల్గొండ జిల్లాల అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదని ఆరోపించారు. దీంతో రోడ్డుపై టెంట్ వేసి ఆందోళన చేస్తున్నట్లు తెలిపారు. సమాచారం అందుకున్న యాచారం సీఐ లింగయ్య సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. నల్గొండ జిల్లా రోడ్డు భవనాల శాఖ డీఈఈ నరేందర్‌రెడ్డితో సీఐ లింగయ్య ఫోనులో మాట్లాడి ప్రయాణికుల ఆందోళన విషయం తెలియజేశారు. డీఈఈ నరేందర్‌రెడ్డి ఆందోళన ప్రదేశానికి వచ్చి నిర్మాణ పనుల్లో ఆలస్యం అయ్యిందని, మార్చి 10వ తేదీ లోపు రోడ్డు మరమ్మతులు పూర్తి చేసి, బీటీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ప్రయాణికులు శాంతించి వెళ్లిపోయారు.

ఫార్మాసిటీ పెద్ద కుంభకోణం

- కేంద్రం నుంచి ఎలాంటి అనుమతులు లేవు
- బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాషా



సమావేశంలో మాట్లాడుతున్న బాషా

యాచారం: ఫార్మాసిటీ ఏర్పాటు ఓ పెద్ద కుంభకోణం అని, ఫార్మాకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాలేదని, అన్ని అనుమతులు వచ్చాయని సీఎం కేసీఆర్ చెప్పుకుంటున్నారని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా పేర్కొన్నారు. యాచారం మండలం కుర్మిద్ద గ్రామంలో సోమవారం రాత్రి ప్రజా గోస – బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీని కేసీఆర్ సర్కార్‌కు రియల్ వ్యాపార సంస్థగా మార్చిందని ఆరోపించారు. రైతుల వద్ద రూ. 8 లక్షల నుంచి రూ. 16 లక్షల వరకు బలవంతంగా అసైన్డ్, పట్టా భూములను కొనుగోలు చేసి వ్యాపార సంస్థలకు రూ. కోటికి పైగా అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. ఫార్మాసిటీ భూసేకరణలో పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీ భూసేకరణపై విచారణ జరిపిస్తామని, అక్రమాలకు పాల్పడిన ఏ అధికారిని వదిలేదన్నారు. రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని అన్నారు. కుర్మిద్ద రైతులు ఎంతో ధైర్యవంతులని అన్నారు. సమావేశంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరిపల్లి అంజయ్య యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, బీజేపీ కుర్మిద్ద శ్రేణులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం
- పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

కడ్తాల్: సెంటిమెంట్ రాజకీయాలతో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దేశాన్ని, రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టాయని పీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం మండలంలోని వంపుగూడ గ్రామంలో హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల క్రితం ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ మాటల పార్టీలన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో రాష్ట్రంలో హాత్ సే హాత్ జోడో యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గడప గడపకు వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో పేద, మధ్యతరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు వంద రూపాయలు దాటిందని, వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.1100 దాటిందని పేర్కొన్నారు. ఏటా 2 కోట్ల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్న కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులను గాలికొదిలిందని విమర్శించారు. ప్రధాన మంత్రి అనాలోచిత వ్యవసాయ చట్టాల వల్ల, వందలాది మంది రైతులు మరణించారని, రైతుల కుటుంబాలు అప్పుల్లో మునిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ హయాంలో 89,184 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా దుర్మార్గ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు యాట నర్సింహ, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు సురేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, జవహర్‌లాల్, రమేశ్, నరేందర్, షాబుద్దీన్, ప్రవీణ్‌రెడ్డి, కిరణ్, శేఖర్, కృష్ణయ్య, రాములు, వినయ్, శ్రీను, సుధాకర్, శేఖర్‌రెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాడ్గుల: మండలంలోని గోప్యతండా వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం అజిలాపూర్‌కు చెందిన నేలపల్లి సైదులు, గునిగంటి మహేశ్‌లు తమ ట్రాక్టర్లలో అనుమతి లేకుండ ఇసుకను తరలిస్తుండగా సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సైదులు, మహేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

డ్రైవర్ అదృశ్యం



వెంకటేష్ (ఫైల్)

మీర్‌పేట: పని కోసం వెళ్లిన డ్రైవర్ అదృశ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జిల్లెలగూడ విరాట్‌నగర్‌కు చెందిన నర్సింగ్ వెంకటేష్ (39) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 8వ తేదీ డ్రైవింగ్ నిమిత్తం కర్ణాటకకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛ్ ఆఫ్ చేసి ఉండడంతో పాటు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య విమల మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలు

మాడ్గుల: మండలంలోని బ్రాహ్మణపల్లిలో 2019లో జరిగిన హత్యాయత్నం కేసులో మంగళవారం షాద్‌నగర్ అసిస్టెంట్ సెషన్ కోర్టు తీర్పు వెలువరించింది. బ్రాహ్మణపల్లికి చెందిన కట్ట యాదయ్యపై అదే గ్రామానికి చెందిన కట్ట లక్ష్మయ్య, కట్ట వంశీకృష్ణ, కట్ట కృష్ణవంశీలు హత్యాయత్నం చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులకు 5 సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. నిందితులను చర్లపల్లి జైలుకు తరలించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినట్టు సీఐ కృష్ణమోహన్ తెలిపారు.

యువకుడికి కౌన్సెలింగ్

మీర్‌పేట: వాహనదారులను భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న కుమార్ (22) అనే యువకుడిని మీర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మీర్‌పేట న్యూ బాలాజీనగర్ కాలనీ ప్రధాన రహదారి వద్ద ఓ యువకుడు వాహనాలు ఆపి కర్రలు, బండరాళ్లతో బెదిరించి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నాడు. నిత్యం ఇలాగే చేస్తుండడంతో విసుగు చెందిన వాహనదారులు మంగళవారం డయల్ 100కు సమాచారం ఇచ్చారు. దీంతో మీర్‌పేట పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కుమార్ తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

కొటికె విఠల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్

పంజగుట్ట: భారతీయ జీవిత బీమా ఏజెంట్ల అందరిలోనూ దేశంలోనే గత రెండు సంవత్సరాలుగా నెంబర్ 1 స్థానంలో కొటికె విఠల్ నిలవడం అభినందనీయమని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ అన్నారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఇటీవల ఎన్‌టీఆర్ శ్రమశక్తి అవార్డు అందుకున్న వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ సలహాదారు కొటికె విఠల్‌కు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దయానంద్ మాట్లాడుతూ విఠల్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ఆయా రంగాల్లో రాణించాలని కోరారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షులు తంగుటూరి రామకృష్ణ, చైర్మన్ బాబూరావులు మాట్లాడుతూ కొటికె విఠల్ ఎంతో మంది ఏజెంట్లతో స్నేహపూర్వకంగా ఉంటూ వారిలో భరోసా కల్పిస్తూ దేశంలోనే మొదటిస్థానానికి ఎదిగారన్నారు. తమ సంఘం 50 దేశాల్లో 25 రాష్ట్రాల్లో విస్తరించి ఉందన్నారు. తమ కులంలో కూడా 60 శాతం పేదవారు ఉన్నారని, రిజర్వేషన్లు లేక, ప్రభుత్వ పథకాలు పొందక దీనస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడ్వైజర్ చింతల శ్రీనివాస్, వర్కింగ్ ప్రసిడెంట్ రామారావు, కోశాధికారి ఎల్.వి.కుమార్, సెక్రటరీ మల్లిఖార్జున్, ఉపాధ్యక్షులు పబ్బతి రవి, మనీందర్ తదితరులు పాల్గొనానరు.